క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి సోమవారం నగరంలోని సీతమ్మధార ప్రాంతానికి చెందిన నరశిపురం మాధవరావు లక్ష 116 రూపాయలు విరాళం అందజేశారు. సంబంధిత విరాళాన్ని సింహగిరిపై పీఆర్‌వో కార్యాలయంలో నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరపున దాతకు బాండ్‌ని ప్రోటోకాల్ సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ అందజేశారు. దేవస్థానం తరపున స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం ఆలయ అధికారులు అందజేశారు.

యువతి అదృశ్యం

ఎంవీపీ కాలనీ : నగరంలోని మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని రెల్లివీధికి చెందిన చెన్నా ప్రియ (36) అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రెల్లివీధిలో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న ప్రియ నగరంలోని ఓ ప్రైవేట్ స్కూల్ టీచర్‌గా పనిచేస్తోంది. రోజు మాదిరిగానే గత నెల 29న విధులకు వెళ్లిన ప్రియ ఇంటికి తిరిగిరాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఆమె స్నేహితులతోపాటు బంధువుల ఇళ్లలో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. రెండు వారాలవుతున్నా ఆమె జాడ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పన్నకు వైభవంగా నిత్య కల్యాణం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి వారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు



పూజలో పాల్గొన్న ఉభయదాతలు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు సోమవారం 25వ రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల మధ్య శ్రీలక్ష్మి పూజలు ప్రారంభించారు. ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఆలయ ఏఈవో కె.రాజేంద్రకుమార్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నేడు అష్టదళ పద్మారాధన

కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి.

జోన్-2 ఏసీపీగా షబ్నమ్



షబ్నమ్ శాస్త్రి

పీఎం పాలెం: జీవీఎంసీ జోన్-2 ఏసీపీగా నియమితులైతన షబ్నమ్ శాస్త్రి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన జోన్-3 ఏసీపీగా పని చేస్తూ, ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఆయన మాట్లాడుతూ జోన్ పరిధిలో ప్రభుత్వ భూములను పరిరక్షిస్తామన్నారు. అక్రమ నిర్మాణాలను తొలగించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

చిరు వ్యాపారులపై వర్షం దెబ్బ..!

- అమ్మకాల్లేక ఆర్థిక ఇబ్బందులు
- అల్పపీడన ప్రభావంతో ఆగకుండా కురుస్తున్న వర్షం
- సందర్శకులు లేక వెలవెలబోయిన పార్కులు



భారీ వర్షం కారణంగా రోడ్డుపై ప్రవహిస్తున్న లాసన్స్ బే కాలనీ గెడ్డ

ఎంవీపీ కాలనీ : బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మూడు రోజులుగా తెరిపివ్వకుండా కురుస్తున్న జడివాన చిరు వ్యాపారులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. విశాఖ తూర్పు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో చిరు వ్యాపారులు వర్షం వల్ల వ్యాపారాలు నిలిచిపోయి నష్టాలు చవిచూస్తున్నారు. భారీ వర్షం కారణంగా ఎంవీపీ కాలనీతోపాటు పలు ప్రాంతాల్లో చిరు వ్యాపారులకు ఎదురు దెబ్బ తగిలింది. ఎంవీపీ కాలనీతోపాటు పెదవాల్తేర్, లాసన్స్ బే కాలనీ, బీచ్‌రోడ్డు ప్రాంతాల్లో చిరు వ్యాపారుల సంఖ్య అధికం. అయితే చాలా చోట్ల రోడ్లపైనా భారీగా వర్షం నీరు నిలిచిపోవడం, వర్షం తెరిపివ్వకపోవడంతో వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొందరు షాపులు తెరిచినప్పటికీ కస్టమర్లు లేక నష్టపోయారు. **సాయంత్రం పూట రోడ్ల పక్కన** నిర్వహించే పానీ**పూరీ, నూడిల్స్, ఇతర ఆహార ప**దార్థాల షాపులూ **తెరుచుకోలేదు.**



సందర్శకులు లేక వెలవెలబోతున్న లాసన్స్ బే కాలనీ పార్క్

వెలవెలబోయిన పార్కులు

మూడు రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా తూర్పు నియోజకవర్గంలోని పార్కులు వెలవెలబోయియాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో వర్షం ఆగకపోవడంతో వాకింగ్‌కు వెళ్లే సీనియర్ సిటిజన్స్, యువకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం పొద్దుపోయే వరకు కురుస్తున్న వర్షానికి జన సంచారం లేక రోడ్లన్నీ వెలవెలబోయాయి. పర్యాటక ప్రాంతాలకు మణిహారంగా నిలిచిన సముద్ర తీర ప్రాంతం అల్పపీడన ప్రభావంతో బోసిపోయింది. బీచ్‌రోడ్డులోని వీఎంఆర్‌డీఏ పార్క్‌తోపాటు లాసన్స్ బే కాలనీ పార్క్, శివాజీ పార్క్ సహా అనేక సెక్టార్లలోని పార్కులు సందర్శకులు లేక వెలవెలబోయాయి. పలు చోట్ల పార్కుల్లో సైతం నీరు నిలిచిపోవడంతో అధ్వాన్న పరిస్థితులు ఏర్పడ్డాయి. వాకింగ్ ట్రాక్స్‌తోపాటు చిల్డ్రన్ ప్లే ఏరియాలు వాననీటిలో ఉండిపోయాయి. మరో రెండు రోజులు వర్ష సూచనలు ఉండటంతో ఆయా ప్రాంతాల ప్రజలు, సందర్శకులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ఉద్యోగులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



సందర్శకులు లేక నిర్మానుష్యంగా మారిన ఎంవీపీ కాలనీ సెక్టార్ - 10లోని పార్క్



షాపుల ఎదుట నిలిచిపోయిన వర్షపు నీరు

కాలువలను తలపించిన రోడ్లు

దీంతోపాటు సోమవారం ఉదయం నుంచి కూడా వర్షం భారీగా కురవడంతో పలు చోట్ల రోడ్లు, కూడళ్లు జలమయమయ్యాయి. ఏఎస్ రాజా కూడలికి నాలుగువైపుల నుంచి నీరు ముంచెత్తడంతో జలమయంగా మారింది. ఐ హాస్పిటల్ వైపు, ఇసుకతోట కూడలి, బీచ్ వైపు నుంచి వచ్చే వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతోపాటు వర్షం కారణంగా ఎంవీపీ కాలనీలోని ఉషోదయ కూడలి నుంచి లాసన్స్‌బే కాలనీ మీదుగా బీచ్‌రోడ్డుకు వెళ్లే రోడ్డు కాలువను తలపించింది. లాసన్స్ బే కాలనీ నుంచి వచ్చే గెడ్డ నీరు పూర్తిగా రోడ్డుపైకి మళ్లడంతో రోడ్డు జలయమయంగా మారింది. దీంతో కొన్నిచోట్ల వర్షపు నీరు, డ్రైనేజ్ నీరు ఏకమై ఒక్కసారిగా రోడ్లపైకి వచ్చింది. పలు చోట్ల యూజీడీ డ్రెన్లు ఉప్పొంగడంతో భారీగా మురుగునీరు రోడ్లపైకి చేరింది.



జలమయమైన లాసన్స్ బే కాలనీ పోస్టాఫీసు రోడ్డు

రహదారులను ఆనుకుని ఉన్న పలు షాపుల్లోకి నీరు చేరడంతో వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బందులకు గురయ్యారు. ఫుట్‌పాత్ వ్యాపారాలు సాగలేదు. రోడ్ల పక్కన నిర్వహించే చిన్న చిన్న దుకాణాలు మూతపడ్డాయి. కీలకమైన ఎంవీపీ కాలనీలోని రైతుబజార్‌కు వినియోగదారులు పెద్దగా రాలేదు.

ఏయూతో ఐఐటీఎం ఎంవోయూ



వీసీ రాజశేఖర్ సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయ రావు, ఐఐటీఎం డైరెక్టర్ డాక్టర్ సూర్యచంద్రరావు

విశాఖ సిటీ : ఆంధ్ర విశ్వవిద్యాలయంతో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటరాలజీ (ఐఐటీఎం) సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంది. సోమవారం ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సమక్షంలో అవగాహన ఒప్పందంపై ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ఐఐటీఎం డైరెక్టర్ డాక్టర్ ఎ.సూర్య చంద్రరావు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రాజెక్టులను సాధించి నిర్వహించే దిశగా రెండు సంస్థలు కృషి చేయాలని సూచించారు. పోస్ట్ డాక్టరల్ ఫెలోషిప్‌లను ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఎంవోయూ ప్రగతిని సమీక్షించాలన్నారు. ఐఐటీఎం డైరెక్టర్ సూర్యచంద్రరావు మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఒక ప్రత్యేకమైన వాతావరణ అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉందన్నారు. వాతావరణ అంచనాలను సిద్ధం చేసి తగిన సూచనలు ఇచ్చే విధంగా ఈ కేంద్రం పనిచేయాలని చెప్పారు. దేశీయ టెక్నాలజీని అభివృద్ధి చేసి సెన్సార్ల నుంచి పరికరాల వరకు దేశీయ సాంకేతిక ఉపకరణాలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఇక్కడ చదువుకునే విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించే దిశగా కృషి జరుగుతోందన్నారు. నగర స్థాయిలో వాతావరణ అంచనాలను అందించడంపై చేపడుతున్న చర్యలను వివరించారు. ఏయూ వాతావరణ అధ్యయన విభాగాధిపతి ఆచార్య పి.సునీత మాట్లాడుతూ పరిశోధనలో సంయుక్త కార్యాచరణ, ఐఐటీఎంకు సంబంధించిన పరిశోధనలకు సమాచార మార్పిడి, విద్యార్థులకు శిక్షణ, వర్క్‌షాప్‌ల నిర్వహణ, ఇంటర్న్‌షిప్‌లు, ఫ్యాకల్టీ కొలాబరేషన్ వంటివి నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్ బాబు, ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, జి.శశిభూషణరావు, ఐఐటీఎం శాస్త్రవేత్తలు డి.పద్మకుమారి, సచిన్‌దేశ్‌పాండే, శుభ్రత్ కుమార్ దాస్, విభాగాధిపతులు, ఆచార్యులు, డీన్‌లు పాల్గొన్నారు.

నేతాజీ ఆశయాలకు పునరంకితం కావాలి



నివాళులర్పిస్తున్న ఆచార్య షారోన్ రాజు, తదితరులు

విశాఖ విద్య : స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ 80వ వర్ధంతిని ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగంలో సోమవారం నిర్వహించారు. ముందుగా సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి విభాగాధిపతి ఆచార్య షారోన్‌రాజు పూలమాలవేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర్య పోరాటంలో సుభాష్ చంద్రబోస్ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని కలిగి ఉన్నారన్నారు. ఆజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి భారతీయ యువతను స్వాతంత్ర్య ఉద్యమం దిశగా నడిపించిన విధానం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. బ్రిటిష్ వారికి మన సత్తా చాటే విధంగా ఆయన దీనిని తీర్చిదిద్ది నిర్వహించారని గుర్తు చేశారు. విద్యార్థులు ఇటువంటి మహనీయులను, స్ఫూర్తిదాతలను ఆదర్శంగా తీసుకుని దేశం కోసం పాటుపడాలని సూచించారు. భవిష్యత్ ఉపాధ్యాయులుగా మారే మీరంతా చిన్నారుల్లో దేశభక్తి నింపేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో విభాగ అధ్యాపకులు డాక్టర్ ప్రకాష్, డాక్టర్ ఆలీ, డాక్టర్ సాల్మన్, డాక్టర్ హరిబాబు, డాక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

ద్విచక్ర వాహనాల రికవరీ



రికవరీ చేసిన ద్విచక్ర వాహనాన్ని యజమానికి అప్పగిస్తున్న క్రైం ఎస్ఐ సూరిబాబు

పెందుర్తి: పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీకి గురైన మూడు ద్విచక్ర వాహనాలను క్రైం విభాగం పోలీసులు గంటల వ్యవధిలో రికవరీ చేశారు. వివరాలివి.. సోమవారం ఉదయం పురుషోత్తపురం సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు, గొర్లివానికాలనీలో ఓ స్కూటీ చోరీకి గురైనట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. దీనిపై వెస్ట్ జోన్ క్రైం విభాగం సీఐ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు వెంటనే స్పందించిన ఎస్ఐ డి.సూరిబాబు, సిబ్బంది కె.శ్రీనివాసరావు, వి.విజయ్‌కుమార్ రంగంలోకి దిగారు. సీసీ పుటేజీల ఆధారంగా ఆయా ద్విచక్ర వాహనాలను సాయంత్రానికి గుర్తించారు. వాటిని పెందుర్తి పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ సూరిబాబు చేతుల మీదుగా అందజేశారు.

మూడో రోజూ కుండపోత వర్షం

- ఆరిలోవ రోడ్లపై నిలిచిన నీరు
- రాకపోకలకు ఇబ్బందులు



ఆరిలోవ కాలనీ 40 గజాల రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



ఆరిలోవ రోడ్డుపై వరద నీటి ప్రవాహం

ఆరిలోవ : నగరంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరద నీటితో రోడ్లు, కాలువలు నిండిపోతున్నాయి. సోమవారం ఉదయం నుంచి కురిసిన భారీ వర్షానికి ఆరిలోవ ప్రాంతంలో కాలువలు పొంగిపోయి రోడ్లపైకి వరద నీరు చేరింది. కొన్నిచోట్ల రోడ్లపై పల్లం భాగాల్లో నీరు నిలిచిపోయింది. వాహనాల రాకపోకలకు ఆటంకంగా మారింది. మరికొన్నిచోట్ల కాలువలు పొంగిపోవడంతో రోడ్ల పైనుంచి వరద నీరు ప్రవహించి గెడ్డలోకి చేరింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆరిలోవ కాలనీ, శ్రీకాంత్‌నగర్ రోడ్డు, బీఆర్టీఎస్‌లో పెదగదిలి కూడలి, హనుమంతవాక కూడలిలో రోడ్లపై వరద నీరు నిలిచిపోయింది. ఆ నీటిలో రాకపోకలు సాగించేందుకు వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు.

కొండవాలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆరిలోవ : వర్షాకాలంలో కొండవాలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మేయర్ పీలా శ్రీనివాసరావు సూచించారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలుచోట్ల ఇంటి గోడలు కూలిపోయాయి. ఆదివారం పన్నెండో వార్డు పరిధి పెదగదిలి కొండవాలులో ఓ ఇంటి గోడ కూలిపోయింది. పదమూడో వార్డు పరిధి రామకృష్ణాపురంలో మరో ఇంటి గోడ కూలింది. ఆయా కాలనీలతోపాటు తొమ్మిదో వార్డు పరిధి సింహగిరికాలనీ కొండవాలులో మేయర్, జోన్ - 2 జెడ్సీ కనకమహాలక్ష్మి, స్థానిక నాయకులు సోమవారం పర్యటించారు. ఆయా చోట్ల కూలిన గోడలను పరిశీలించారు. వాటికి నష్టపరిహారం కోసం జీవీఎంసీ అధికారులతో మాట్లాడుతానని బాధితులకు మేయర్ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొండవాలులో రక్షణ గోడలు నిర్మించాల్సి ఉందన్నారు. రామకృష్ణాపురంలో గెడ్డలలో పూడిక తొలగించి శుభ్రం చేయాలని అధికారులకు సూచించారు. సింహగిరి కాలనీలో కొన్నిచోట్ల మెట్లు జారిపోయేలా ఉన్నాయని... ఆ మెట్లు జారకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపడతామన్నారు. ఈ పర్యటనలో పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



రామకృష్ణాపురంలో కూలిన గోడ పరిశీలిస్తున్న మేయర్, జెడ్సీ

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని వినతి



కలెక్టరేట్‌లో బీఎస్పీ నాయకులు

మహారాణిపేట: బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) జిల్లా అధ్యక్షుడు భీమరశెట్టి విశ్వనాథం కోరారు. సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. బీఎస్పీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి శివప్రసాదరావు, జిల్లా ఇన్‌చార్జిలు పెద్దాడ కనకమహాలక్ష్మి, ఎ.రామచంద్రరావు, వైస్ ప్రెసిడెంట్ ఎ. ధనుంజయరావు, గాజువాక అధ్యక్షుడు నందికొల్ల అప్పారావు, ఇతర నాయకులు శంకరరావు, దేవరపల్లి శరత్, అన్నవరం పాల్గొన్నారు.

రోడ్లపై బురద తొలగింపు



బురద తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

బీచ్‌రోడ్డు : మూడు రోజులుగా నగరంలో కురుస్తున్న వర్షాలకు రోడ్లపై పేరుకుపోయిన బురదను జీవీఎంసీ సిబ్బంది సోమవారం తొలగించారు. 28వ వార్డులో రోడ్లపై బురద పేరుకుపోయిందని స్థానికులు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు దృష్టికి తీసుకెళ్లారు. వారి పర్యవేక్షణలో సిబ్బంది బురద తొలగించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సురేష్, సూపర్‌వైజర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ముడసర్లోవ రిజర్వాయర్‌కు కొత్త నీరు



కొత్త నీటితో ముడసర్లోవ రిజర్వాయర్

ఆరిలోవ : మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ముడసర్లోవ రిజర్వాయర్‌లో కొత్త నీరు చేరింది. దీని నీటి మట్టం కొంత మేరకు పెరిగింది. దీంతో ఆరిలోవ వాసులకు నీటి సమస్య ప్రస్తుతం తీరినట్లయింది. కొంత కాలంగా వర్షాలు లేకపోవడంతోపాటు ఇటీవల తీవ్రమైన ఎండలకు ఈ రిజర్వాయర్‌లో నీరు అడుగంటిపోయింది. దీంతో నీటి సరఫరా విభాగం అధికారులు ఆరిలోవ ప్రాంతానికి సక్రమంగా నీటి సరఫరా చేయలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు భూగర్భ జలాలు ఇంకిపోయి నీటి కోసం ఆరిలోవ ప్రాంతంలో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. రిజర్వాయర్ సామర్థ్యం 170 అడుగులు కాగా ఇటీవల ఎండలకు 158.2 అడుగులకు నీరు ఇంకిపోయింది. ప్రస్తుతం భారీగా కురిసిన వర్షాలకు పైనుంచి వచ్చిన వరద నీరు చేరడంతో సోమవారం సాయంత్రానికి నీటి మట్టం 159.8 అడుగులకు చేరింది. దీనిలో 1.6 అడుగులు కొత్త నీరు చేరినట్లు నీటి సరఫరా విభాగం అధికారులు తెలిపారు. దీంతో రిజర్వాయరులో కొత్త నీరు చేరడంతోపాటు భూగర్భ జలాలు కూడా పెరుగుతాయని అధికారులు అంటున్నారు. ఫలితంగా ఆరిలోవ ప్రాంతానికి కొంత వరకు నీటి సమస్య తీరుతుందని భావిస్తున్నారు.

డేటా విశ్లేషణలో క్వాంటమ్ టెక్నాలజీ కీలకం



ప్రసంగిస్తున్న కృష్ణా విశ్వవిద్యాలయం వీసీ రాంజీ

మురళీనగర్: అభివృద్ధి చెందుతున్న సాంకేతిక ప్రపంచంలో డేటా విశ్లేషణకు సంబంధించి క్వాంటమ్ టెక్నాలజీ కీలకం కానుందని కృష్ణా విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ కె.రాంజీ అన్నారు. ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఏఐసీటీఈ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ అధ్యాపకులకు 'న్యూమరికల్ అప్రోచ్ ఇన్ డిజైన్ థింకింగ్' అనే అంశంపై కంచరపాలెం పాలిటెక్నిక్ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నకుమార్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించి ప్రసంగించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను బోధనాభ్యసనలో వినియోగించాలని సూచించారు. ఫైనైట్ ఎలిమెంట్, ఫైనైట్ డిఫరెన్స్, ఫైనైట్ వాల్యూమ్ పద్ధతులను భవిష్యత్తులో ఏఐ వంటి టెక్నాలజీలో వినియోగిస్తారన్నారు. గౌరవ అతిథి, రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ ఎం.ఎ.వి.రామకృష్ణ మాట్లాడుతూ డిప్లొమా స్థాయిలోనే హ్యూమన్ ఫ్రెండ్లీ డిజిటల్ టెక్నాలజీని పాఠ్యాంశంగా చేర్చాల్సి ఉందన్నారు. దీని వల్ల విద్యార్థులు భవిష్యత్తులో ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, రోబోటిక్స్ వంటి రంగాల్లో మెరుగైన అవకాశాలను పొందుతారన్నారు. ప్రత్యేక అతిథి శ్రీకాకుళం పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు మాట్లాడుతూ అధ్యాపకులు, విద్యార్థుల కెరీర్‌కు డిజైన్ థింకింగ్ ఉపయోగపడుతుందని చెప్పారు. ఎన్ఎస్‌టీఎల్ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ పి.వి.ఎస్.గణేష్‌కుమార్ డిజైన్ థింకింగ్ ప్రాముఖ్యతను వివరించారు. శిక్షణకు వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కాలేజీల ఫ్యాకల్టీలు, ఇంజినీరింగ్ కళాశాలల అధ్యాపకులు, పరిశోధకులు హాజరయ్యారు. కార్యక్రమంలో గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, ఆముదాలవలస, పెందుర్తి, అనకాపల్లి పాలిటెక్నిక్ కాలేజీల ప్రిన్సిపాళ్లు డాక్టర్ కె.జానకీరాం, డాక్టర్ ఎన్.చంద్రశేఖర్, ఐ.వి.ఎస్.ఎస్.శ్రీనివాసరావు, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్.రాజు, కో-కో ఆర్డినేటర్ ఎం.భరణి పాల్గొన్నారు.